క్లుప్తంగా

రైతు బంధుకు దరఖాస్తు చేసుకోవాలి



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఈఓ వెంకటేష్

డిండి : నూతనంగా భూమి పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన వారితో పాటు గతంలో రైతు బంధు పొందని రైతులు పంట పెట్టుబడి సాయానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకుగాను పట్టాదారు పాస్‌పుస్తకము, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌ను దరఖాస్తు ఫారానికి జత చేసి సంబంధిత ఏఈఓకు అందజేయాలన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని చెర్కుపల్లి గ్రామ శివారులో గల వ్యవసాయ పొలంలోని వేరుశనగ పంటను మండల ఏఈఓ వెంకటేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాసంగి సీజన్‌లో ఆరుతడి పంటసాగుకు రైతులు మొగ్గు చూపాలని సూచించారు.

ప్రభుత్వం ఆదుకోవాలని ఆటోడ్రైవర్ల ధర్నా



ధర్నా చేస్తున్న ఆటోడ్రైవర్లు

పెద్దఅడిశర్లపల్లి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు సేవలతో ఉపాధి కోల్పోతున్నామని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ గురువారం మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్ వద్ద ఆటోడ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆటోలపై ఆధారపడిన తమ జీవితాలను ప్రభుత్వం ఆలోచించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు పెద్దులు, జోజి, యేసు, వెంకటయ్య, పవన్, సునీల్, మార్టిన్ తదితరులున్నారు.

శ్రీఆంజనేయస్వామి మహా పడిపూజ



ఆలయానికి విరాళం అందజేస్తున్న భక్తుడు

చందంపేట : మండల కేంద్రంలో శ్రీ ఆంజనేయస్వామి మహా పడిపూజ మహోత్సవాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి హాజరైన శ్రీఆంజనేయస్వామి మాలాధారులు, భక్తులు శ్రీ ఆంజనేయ నామస్మరణతో పడిపూజ ప్రాంతం మార్మోగింది. ఈశ్వర్ గురుస్వామి ఆధ్వర్యంలో పడిపూజతో పాటు యజ్ఞం నిర్వహించారు. కాగా టీపీసీసీ మెంబర్, పీఏసీఎస్ చైర్మన్ జాలె నరసింహారెడ్డి మద్దిమడుగులో శ్రీ ఆంజనేయ స్వామి సన్నిధిలో జయరాం గురుస్వామి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సన్నిధానానికి లారీ లోడ్ సిమెంట్‌ను విరాళంగా ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీపీ పార్వతీచందునాయక్, జెడ్పీటీసీ బుజ్జి లచ్చిరాంనాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బద్యానాయక్, ఎంపీటీసీ నోముల మల్లయ్య, కోఆప్షన్ మెంబర్ ఎండీ.సాధిక్, శ్రీధర్, వెంకులు, కొండలు, సైదులు, ఆంజనేయ స్వామి మాలాధారులు, భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపులో క్రైస్తవుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న తిప్పర్తి జెడ్పీటీసీ రాంరెడ్డి

రామగిరి(నల్లగొండ): కాంగ్రెస్ పార్టీ గెలుపులో క్రైస్తవుల పాత్ర కీలకమని తిప్పర్తి జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి అన్నారు. గురువారం తిప్పర్తి మండలం మల్లేపల్లివారిగూడెం బేతనీయ చర్చిలో నిర్వహించిన కృతజ్ఞత సభలో ఆయన మాట్లాడారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. మండలంలోని క్రైస్తవులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. చర్చి పాస్టర్ ప్రీతిప్రశాంత్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో పాశం రాంరెడ్డి కృషి వల్లనే తిప్పర్తి మండలంలో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజార్టీ వచ్చిందన్నారు. అనంతరం రాంరెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ల సంఘం అధ్యక్షుడు కత్తి డేవిడ్‌రాజు, కోశాధికారి ఎం.రవికుమార్, గౌరవ అధ్యక్షుడు ఎమ్.ఏసయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట్ల రవీందర్‌రెడ్డి, జాకటి మోష, నలపరాజు శ్రీనివాస్, నాగరాజు, పాస్టర్లు ఉన్నారు.

18న కేవీపీఎస్ సమావేశం

నల్లగొండ టౌన్ : కేవీపీఎస్ జిల్లా కమిటీ సమావేశం ఈ నెల 18న సంఘం కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

- సొంత భవనాలు లేక అరకొర వసతులతో అవస్థలు
- ఇరుకు గదుల్లో ఇబ్బందులు పడుతున్న చిన్నారులు, గర్భిణులు
- సమయానికి రాని ఇంటి అద్దె బిల్లులు



ఏనేమీదితండాలో అద్దె ఇంట్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం



పిన్నవూరలో జీపీ భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

పెద్దవూర : ఐదేళ్లలోపు చిన్నారులకు ఆట, పాటలతో పాఠశాలలకు అలవాటు చేసేందుకు ముందుగా ప్రాథమిక విద్య నేర్పించాలన్న ప్రధాన లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశాయి. ఈ కేంద్రాలతో పోషక విలువలతో కూడిన ఆహారాన్ని సైతం చిన్నారులకు అందిస్తున్నారు. ఇవికాక కిషోర బాలికలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించటంలోనూ అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. పౌష్టికాహారలోపాన్ని నివారించాలనే సంకల్పంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఈ కేంద్రాల్లోనే ఒకపూట సంపూర్ణ భోజనం అందిస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఏటా కోట్ల రూపాయలను వెచ్చిస్తుంది. ప్రభుత్వం సంకల్పించిన ఆ ఆశయాలు, లక్ష్యాలు బాగానే ఉన్నా ఇలాంటి కేంద్రాలు శాశ్వత భవనాలు లేక అద్దె భవనాల్లో అనేక ఇబ్బందుల నడుమ కొనసాగుతున్నాయి. వాటికి సొంత భవనాల ఏర్పాటు విషయంలోనే అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను మోడల్ స్కూల్స్‌గా అభివృద్ధి చేస్తామన్న పాలకుల మాటలు నీటి మీద రాతలే అవుతున్నాయి.

ప్రాజెక్టు పరిధిలో ఇలా..

గతంలో పెద్దవూర, నిడమనూరు, అనుముల, త్రిపురారం మండలాలకు కలిపి 1986లో పెద్దవూర ఐసీడీఎస్ ప్రాజెక్టును పెద్దవూరలో స్థాపించారు. ఆ తర్వాత మౌలిక వసతుల లేమితో పెద్దవూర ఐసీడీఎస్ ప్రాజెక్టును నాలుగేళ్ల క్రితం అనుముల మండలం హాలియాకు మార్చారు. ప్రాజెక్టు పరిధిలో ప్రస్తుతం పెద్దవూర, అనుముల, నిడమనూరు, తిరుమలగిరి మండలాలు ఉన్నాయి. అనుముల ప్రాజెక్టు కింద పెద్దవూర మండలంలో 76అంగన్‌వాడీ కేంద్రాలు, అనుముల మండలంలో 52, నిడమనూరులో 56, తిరుమలగిరి మండలంలో 71 అంగన్‌వాడీ కేంద్రాలు కలిపి మొత్తం 255 కేంద్రాలు నడుస్తున్నాయి. వాటితో పాటు 26 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో 10అంగన్‌వాడీ సెక్టారులను ఏర్పాటు చేశారు. ఒక్కో సెక్టారులో 20నుంచి 30అంగన్‌వాడీ కేంద్రాలను కలిపి ఒక సూపర్‌వైజర్ పర్యవేక్షణలో నడుస్తున్నాయి. వాటిలో ఆరు ఏళ్లలోపు చిన్నారులు 7565 మంది, బాలింతలు 933 మంది, గర్భిణులు 1023 మంది ఉన్నారు.

అద్దె భవనాలే దిక్కు..

ప్రాజెక్టు పరిధిలో మొత్తం 255 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా ఇందులో పక్కా భవనాలు ఉన్నవి కేవలం 69కేంద్రాలే. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నవి 88కాగా, ప్రభుత్వ పాఠశాలలు, కమ్యూనిటీ హాల్‌లు, గ్రామపంచాయతీల్లో నడుస్తున్నవి 98 కేంద్రాలు ఉన్నాయి. 26 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు అన్ని అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. దీంతో అద్దె భవనాల్లో మౌలిక వసతులు లేక అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అద్దె భవనాలకు ప్రభుత్వం అద్దె సకాలంలో విడుదల చేయడం లేదని, దీంతో ఇంటి యజమానులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని సిబ్బంది వాపోతున్నారు. అద్దె భవనాలలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీరు ఉండటం లేదు. దీనికి తోడు ఇళ్లలో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తుండటంతో కొందరు గర్భిణులు, బాలింతలు రావడం లేదు. చిన్నారులను సైతం పంపించడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాము



అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలను నిర్మించాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాము. ప్రాజెక్టు పరిధిలో 255అంగన్‌వాడీ కేంద్రాలు, 26మినీ అంగన్‌వాడీ కేంద్రాలు కలిపి 311కేంద్రాలు ఉండగా కేవలం 69 కేంద్రాలకే పక్కా భవనాలు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు ఇళ్లను అద్దెకు ఇవ్వడానికి ఇంటి యజమానులు ముందుకు రావడం లేదు. ఒక వేళ అద్దెకు ఇచ్చినా అందులో మౌలిక వసతులు ఉండటం లేదు. తప్పని పరిస్థితుల్లోనే అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నాము.

– గంధం పద్మావతి, సీడీపీఓ, అనుముల ప్రాజెక్టు

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి



బాలునాయక్,ఎమ్మెల్యే

దేవరకొండ : నియోజకవర్గ పరిధిలోని వివిధ పెండింగ్ ప్రాజెక్టులను ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో రాష్ట్ర ఇరిగేషన్ ప్రాజెక్టులపై సంబంధిత అధికారులతో నిర్వహించిన రివ్యూ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవరకొండ నియోజకవర్గంలోని డిండి ఎత్తిపోతల, నక్కలగండి, పెండ్లిపాకల ప్రాజెక్టులపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. డిండి ఎత్తిపోతలకు సంబంధించి నీటిని ఎక్కడి నుంచి తీసుకోవాలన్న అంశంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అంతే కాకుండా ఆయా ప్రాజెక్టులకు సంబంధించి ఆర్అండ్ఆర్ సమస్యలను పరిష్కరించి పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇందుకు స్పందించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రాజెక్టుల పూర్తికి సంబంధించి సంబంధిత అధికారులను ఆదేశించినట్లు ఆయన విలేకరులకు వెల్లడించారు.

కొనసాగుతున్న తపాలా ఉద్యోగుల సమ్మె



సమ్మెను ఉద్దేశించి మాట్లాడుతున్న డివిజన్ ప్రధాన కార్యదర్శి సుధాకర్

మిర్యాలగూడ టౌన్ : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గ్రామీణ తపాలా ఉద్యోగులు చేపట్టిన సమ్మె గురువారం మూడో రోజుకు చేరింది. ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్ సంఘాల పిలుపు మేరకు గురువారం స్థానిక ప్రధాన పోస్టాఫీసు వద్ద చేపట్టి సమ్మెలో నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్ సూర్యాపేట డివిజన్ ప్రధాన కార్యదర్శి సుధాకర్, సూర్యాపేట డివిజన్ జీడీఎస్ పీజేసీఏ చైర్మన్ పి.రవి, కన్వీనర్ జి.నాగరాజు మాట్లాడారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వంతో పాటు డిపార్ట్‌మెంట్ అధికారులు స్పందించకపోవడంతోనే సమ్మెలోకి వెళ్లామన్నారు. టార్గెట్ల పేరుతో జీడీఎస్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న అన్నీ రకాల వేధింపులను నిలుపుదల చేయాలని, కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులను తక్షణమే అమలు చేయాలని, రెగ్యులరైజ్ జీడీఎస్‌లు సెలవు పెట్టేటప్పుడు వర్క్‌లోడుతో ఎలాంటి సంబంధం లేకుండా సబ్‌స్టిట్యూట్‌ను అనుమతించాలని, జీడీఎస్, వారి కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయాన్ని కల్పించాలని, గ్రూఫ్ ఇనూరెన్స్, గ్రాడ్యూటీని రూ.5లక్షలకు పెంచాలని, 8గంటలు పని, పెన్షన్‌తో సహా అన్నీ ప్రయోజనాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెలో పోస్టల్ రిటైర్డ్ ఉద్యోగి రామయ్య, యూనియన్ల నాయకులు వంశీ, జహంగీర్, మర్రి చెన్నా, అరుణ, భవానీ, అశ్విని, భిక్షం తదితరులున్నారు.

మద్యం దుకాణం ఏర్పాటులో వివాదం

- అనుమతి ఒక చోట.. ఏర్పాటు మరోచోట

మిర్యాలగూడ : మద్యం దుకాణాల ఏర్పాటులో నిబంధనలను పాటించాలని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ అనుమతి పొందిన వారు నిబంధనలు పాటించకుండా ఒక చోట ఏర్పాటు చేయాల్సి ఉండగా మరో చోట ఏర్పాటు చేస్తుండడంతో వివాదాలకు కారణమవుతుంది. ఈ ఏడాది ఆగస్టు 4న జిల్లా వ్యాప్తంగా 155మద్యం దుకాణాలకు గాను ఎక్సైజ్ శాఖ అధికారులు నోటిఫికేషన్ జారీ చేసి బహిరంగ వేలం నిర్వహించారు. దుకాణాలను నిబంధనల ప్రకారం ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయమై ఎక్సైజ్ అధికారులు సంబంధిత వేలం నోటీసులో పొందుపరిచారు. జిల్లా వ్యాప్తంగా డిసెంబర్ 1న నూతన మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకోగా మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డికాలనీలో మద్యం దుకాణం ఏర్పాటులో వివాదం చోటు చేసుకోవడంతో 15రోజులు గడువు దాటినా ప్రారంభించలేదు. నిబంధనల మేరకు బహిరంగ వేలంలో దుకాణాన్ని దక్కించుకున్న వ్యక్తిని దుకాణం ఏర్పాటు చేయకుండా కొందరు అడ్డుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో లైసెన్స్ పొందిన వ్యక్తులు నిబంధనలకు విరుద్ధంగా రెడ్డికాలనీలో దుకాణం ఏర్పాటు చేసేందుకుగాను సన్నాహాలు చేస్తున్నారు. అందుకు దుకాణం ఏర్పాటు చేయకుండా అంగ, అర్థబలం ఉపయోగిస్తుండగా అధికారులు సైతం అడ్డుకోలేని పరిస్థితి నెలకొంది. గతంలో సిండికేట్ నిర్వహించి అక్రమాలకు పాల్పడిన కొందరు తామే మరోసారి దందా చేసేందుకుగాను ముందస్తు వ్యూహంతో దుకాణం ఏర్పాటును అడ్డుకుంటున్నారని తెలుస్తుంది.

సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తాం

రెడ్డికాలనీలో మద్యం దుకాణం ఏర్పాటు చేసే విషయంలో దుకాణాల వారి మధ్య కొంత వివాదం నెలకొన్న మాట వాస్తవమే. ఎవరి గెజిట్ పరిధిలో వారు దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని మేము సూచించాం. నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు ఏర్పాటు చేయనివ్వం. స్థలం మార్పు విషయం సమస్యను ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు నివేదిస్తాం.

– మహేశ్వర్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ మిర్యాలగూడ

బస్సు సౌకర్యం కల్పించాలి

మాడుగులపల్లి : మండలంలోని అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు పతాని శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సులు నడపకుండా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తే ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. మిర్యాలగూడ నుంచి పాములపహాడ్‌కు ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని కోరారు. ఆయన వెంట పలువురు డీవైఎఫ్ఐ నాయకులు, స్థానికులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గం



సమావేశంలో మాట్లాడుతున్న గాదగోని రవి

మిర్యాలగూడ అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే ఏకైక మార్గమని ఎంసీపీఐ యూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. గురువారం మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో నిర్వహించిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల నాలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ పార్టీ హిందుత్వ కార్డును ప్రజల్లోకి తీసుకెళ్లి మూడు రాష్ట్రాల్లో గెలిచిందని ఆరోపించారు. అక్కడ గెలవాల్సిన కాంగ్రెస్ ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో సమన్వయం చేసుకోవడంలో విఫలమైందని విమర్శించారు. ఎన్నికల్లో గెలవడం కోసం బీజేపీ అనేక ఎత్తుగడలు వేస్తుందని, దీనిని గమనించి దేశ ప్రజలను చైతన్యవంతులను చేసే బాధ్యత వామపక్ష లౌకికవాద శక్తులపై ఉందన్నారు. బీఆర్ఎస్ పోయి కాంగ్రెస్ వచ్చినా ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేసేది కమ్యూనిస్టులేనని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి దోహదం చేసిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని, మహిళకు ఉచిత బస్సు సౌకర్యం అందాలంటే అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వస్కుల మట్టయ్య, జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ, నాయకులు వస్కుల గోపి, సుకన్య, సైదులు, కాశి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి



కోయల్‌పహాడ్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ జమీరొద్దీన్, ఎంపీడీఓ

మాడుగులపల్లి : మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని తహసీల్దార్ జమీరొద్దీన్ సిబ్బందికి సూచించారు. మండలంలోని ఇందుగుల, ఆగామోత్కూర్, కోయల్‌పహాడ్ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ జితేందర్ రెడ్డితో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. దివ్యాంగుల కోసం ర్యాంపులు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఎక్కడైనా ఇబ్బందులుంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆవాస గ్రామాల్లోనూ పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు కేంద్ర ఎన్నికల కమిషన్ సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. వారి వెంట ఆర్ఐ అక్తర్‌అలీ, రెవెన్యూ సిబ్బంది, బీఎల్ఓలు తదితరులున్నారు.

మిర్యాలగూడను జిల్లాగా ప్రకటించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడను నూతన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాగా ప్రకటించాలని మిర్యాలగూడ జిల్లా సాధన సమితి స్టీరింగ్ కమిటీ సభ్యులు మాలోతు దశరథనాయక్, మోహన్‌రావు, జనమైత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ మునీర్ అన్నారు. గురువారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో స్థానిక ప్రజల అభిప్రాయం మేరకు ఇచ్చిన హామీని నిలబెట్టుకొని జిల్లాగా ప్రకటించాలన్నారు. ప్రస్తుత శాసనసభ సమావేశంలో జిల్లాకు కావాల్సిన అన్నీ అర్హతలు కలిగిన మిర్యాలగూడ జిల్లాను ప్రకటించాలన్నారు. నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన బత్తుల లక్ష్మారెడ్డి ప్రజల అభిప్రాయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి జిల్లా ఏర్పాటుపై ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా జిల్లా ఏర్పాటుపై ప్రభుత్వంతో మాట్లాడి వత్తిడి తీసుకురావాలన్నారు. లేని పక్షంలో భవిష్యత్ కార్యచరణను ప్రకటిస్తామన్నారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు దాసరాజు జయరాజు, జ్వాల వెంకటేశ్వర్లు, మల్లికంటి వెంకటయ్య, దుర్గాప్రసాద్, కృష్ణయ్య తదితరులున్నారు.

కార్యకర్తల అభీష్టం మేరకే భవిష్యత్ నిర్ణయం

నల్లగొండ టూటౌన్: నల్లగొండ నియోజకవర్గ అభివృద్ధి కోసమే తన కార్యాచరణ అని, కార్యకర్తల అభీష్టం మేరకే భవిష్యత్ నిర్ణయం ఉంటుందని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నల్లగొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లి రామరాజుయాదవ్ అన్నారు. గురువారం నల్లగొండ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తాను ప్రజల మధ్యలోనే ఉంటానని, పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కావాలని కోరారు. ప్రతి గ్రామంలో సర్పంచ్, వార్డు మెంబర్‌లను నిలబెట్టి గెలిపించుకుంటానని తెలిపారు. సమావేశంలో దుడుకు లక్ష్మీనారాయణ, పందుల సైదులు, పాల్వాయి రవి, అంతటి జ్యోతి, అల్లి వేణుయాదవ్, ఎంపీటీసీ సత్యవతి సుధాకర్ రెడ్డి, జాన్‌రెడ్డి, నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.

ఆరుతడి పంటలపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ కల్యాణ్‌చక్రవర్తి

మిర్యాలగూడ : ప్రస్తుత యాసంగిలో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున రైతులు తమ భూములను బీడుగా వదిలేయకుండా ఆరుతడి పంటలైన మినుములు, పెసర, ఉలవ, జొన్న, రాగులు వంటి పంటలను సాగు చేసుకోవాలని ఏఓ బి.కల్యాణ్‌చక్రవర్తి రైతులకు సూచించారు. గురువారం దామరచర్ల మండలంలోని కొండ్రపోల్ గ్రామ రైతువేదికలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు వచ్చి ఇప్పటివరకు రైతుబంధుకు దరఖాస్తు చేసుకోని రైతులు వారి పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఆధార్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ పత్రాలతో పాటు దరఖాస్తు ఫారాన్ని సంబంధిత ఏఈఓకు అందజేయాలని సూచించారు. సమావేశంలో సర్పంచ్ పరంగి రాంబాబు, ఏఈఓ రమేష్, సీడ్ ఆఫీసర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి మహా పడిపూజ



అయ్యప్ప మాలధారులకు అన్నదానం నిర్వహిస్తున్న పాండురంగారెడ్డి దంపతులు

హాలియా : పట్టణంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో అఖిల భారత అయ్యప్ప సేవా సంఘం, హనుమాన్ శక్తి జాగరణ సమితి ఆధ్వర్యంలో గురువారం శ్రీ అరుణ్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. మహాపడి పూజకు బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి దంపతులు హాజరై పూజలు చేశారు. మహాపడి పూజ కార్యక్రమం అనంతరం మాలధారులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బిక్ష ఏర్పాటు చేశారు. దీక్షలో ఉన్న అయ్యప్ప స్వాములకు అన్నదానం చేసిన బుసిరెడ్డి పాండురంగారెడ్డి దంపతులను అఖిల భారత అయ్యప్ప సేవ సంఘం సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కాకునూరి నారాయణగౌడ్, తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, యడవెల్లి దిలీప్‌రెడ్డి, మందా నరేందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, మేడిపల్లి మోహన్‌రావు, రాయప్రోలు మురళి కృష్ణ, రేపాల వెంకన్న తదితరులు ఉన్నారు.

16,17న అయ్యప్పస్వామి మండల పూజ

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని శ్రీ సీతారామ చంద్రమౌళీశ్వర అయ్యప్పస్వామి దేవాలయంలో ఈనెల 16, 17తేదీల్లో అయ్యప్పస్వామి మండల పూజా మహోత్సవం నిర్వహించనున్నట్లు గురుస్వాములు చిట్టెడి ప్రభాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డిలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న మహా పడిపూజ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అయ్యప్ప మాలాధారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. వారి వెంట పురోహితులు పాల గణపతిశర్మ, పాల సదాశివశర్మ, జయప్రకాశ్‌శర్మ, శివప్రసాద్ శర్మ తదితరులు ఉన్నారు.

మహిళా సాధికారతకు కృషి చేయాలి



అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ కృష్ణవేణి

వేములపల్లి : మహిళా సాధికారతకు ప్రతి అంగన్‌వాడీ టీచర్ కృషి చేయాలని డీడబ్ల్యూఓ కృష్ణవేణి అన్నారు. గురువారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. లింగ వివక్ష లేకుండా రూపుమాపాలని, బాల్య వివాహాలు అరికట్టడంతో పాటు బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలోని మహిళలందరికీ అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న దాడులను, దురాచారాలను అరికట్టేందుకు ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రలో చిన్నారులు, గర్భిణులకు పోషకాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ చంద్రకళ, సూపర్‌వైజర్లు సునీత, రజిని, నాగమణి, సంధ్య, విజయ, అంగన్‌వాడీ టీచర్లు రోజా, రజిత, శశికళ, సునీత, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ముందుకా.. వెనక్కా

- మున్సిపాలిటీలో మొత్తం దరఖాస్తులు 14వేలకు పైనే
- పరిష్కారమైనవి 2500మాత్రమే
- ప్లాట్ల క్రమబద్ధీకరణపై లబ్ధిదారుల ఆందోళన



మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయం

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీలో అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్) ప్రక్రియ నూతన ప్రభుత్వంలో ముందుకు సాగుతుందా..? లేక నిలిచిపోతుందా..? అని లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. అయితే ఈ ప్రక్రియ మధ్యలో నిలిచినప్పటికీ గత ప్రభుత్వం ఎన్నికల సమయంలో తిరిగి ప్రారంభించింది. దీంతో క్రమబద్ధీకరణకు లబ్ధిదారులు మీ సేవల్లోనే లక్షలాది రూపాయల ఫీజులు చెల్లించించి దరఖాస్తు చేసుకున్నారు. తరువాత ప్రక్రియలో ప్రొసిడింగ్ జారీ చేస్తే వాటి ఆధారంగా ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయవచ్చు. అప్పట్లోప్రధానంగా ధ్రువపత్రాలు సరిగా అందకపోవడంతో ఈ ప్రక్రియలో కొంత మేరకు జాప్యం నెలకొంది. మధ్యలో సాఫ్ట్‌వేర్‌లో ఇబ్బందులు కావడంతో ఈ వ్యవహారం ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. చాలా వరకు డబ్బులు కట్టిన ఇప్పటి వరకు ప్రొసిడింగ్‌లు అందకపోవడంతో పలువురు లబ్ధిదారులు పట్టణ ప్రణాళిక విభాగం చుట్టూ తిరుగుతున్నారు. ఇంతలోనే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో అధికారులు ఆ పనుల్లో ఉండడంతో దరఖాస్తులను పూర్తిగా పక్కకు పెట్టారు. ఇప్పటికే డబ్బులు చెల్లించిన వారు ఎల్‌ఆర్‌ఎస్ కోసం ఎదురుచూస్తుండగా, అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణతో మున్సిపాలిటీకి మరింత ఆదాయం వస్తుందని ఆశపెట్టుకుంది. ఒక వైపు మున్సిపాలిటీ పరిధిలో కొనుగోలు చేసిన స్థలంలో ఇళ్లు నిర్మించుకునేందుకు క్రమబద్ధీకరణ కాకపోవడంతో దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులు ఏడాది నుంచి నిరీక్షిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ సమస్యను త్వరితిగతిన పరిష్కరించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఏదిఏమైనా కొత్త ప్రభుత్వంలో పూర్తి స్థాయిలో స్పష్టవస్తుందని అధికారులు బావిస్తున్నారు.

14వేల మందికిపైగా దరఖాస్తు..

ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరణకు మున్సిపాలిటీలో సుమారు 14వేల మందికి పైగా దరఖాస్తులు చేసుకున్నారు. వాటిలో కేవలం 2500మాత్రమే పరిష్కారమైనట్లు అధికారులు వెల్లడించారు. ఒక్కొక్క దరఖాస్తుకు లబ్ధిదారుడు రూ.1000 చొప్పున, దరఖాస్తుదారులు రూ.కోటి 40లక్షల వరకు ప్రభుత్వానికి చెల్లించారు. దరఖాస్తులు చేసుకుని ఏడాది గడుస్తున్నా దీనికి సంబంధించిన ఎలాంటి మార్గదర్శకాలు విడుదల కాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

లాగిన్‌కు వచ్చినవి ధ్రువీకరిస్తున్నాం



మున్సిపాలిటీలో ఎల్‌ఆర్ఎస్ కోసం లబ్ధిదారులు భారీగానే దరఖాస్తులు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న వారివి మున్సిపల్ లాగిన్‌లోకి రాగానే అప్రువల్ చేస్తున్నాం. భారీగానే దరఖాస్తు రావడంతో పూర్తి స్థాయిలో పరిశీలించిన తరువాత అప్రువల్ చేస్తున్నాం. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ విషయంలో ఎలాంటి షరతులు ఇవ్వలేదు. ప్రభుత్వం ఎలా చెప్పితే అలా నడుచుకుంటాం

– పూర్ణచందర్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ